

కృష్ణరాజపురం స్టేషనులో ట్రైను ఆగేటప్పటికి రవి యస్ టూ కోచ్ కిటికీల్లోంచి లోపలకు తొంగి చూస్తూ నా గురించి వెతుకుతూ ప్లాట్‌ఫారంపై తిరగడం నేను గమనించాను. ఎనిమిదేళ్ల తర్వాత నన్ను చూడడానికి వాడు పడే ఆత్రం, వాడి కళ్లల్లో కన్పిస్తూనే వుంది. నా పరిస్థితి కూడా అంతే. పెట్టెలోంచి బయటపడి ఒకరినొకరు గాఢంగా ఆలింగనం చేసుకున్న తర్వాత చూసుకుంటే, ఇద్దరిలోనూ కాలం తెచ్చిన మార్పులు చాలా కన్పించాయి. వాడైతే కాస్తంత లావు అయ్యాడు. మనిషి ఇంతకు ముందు కన్నా రంగు తేలి ఆకర్షణీయంగా వున్నాడు. నాకు వాడి కళ్లల్లో చిన్నప్పటి చురుకుదనం, చిలిపితనం అలానే వున్నట్టనిపించింది.

# మరీచిక

## షెహిన్

నేను, రవి ఇద్దరం చిన్నప్పట్నుంచి ఒకే దగ్గర చదువుకున్నాం. నాకన్నా వాడు బాగా చదివేవాడు. టీచర్లందరికీ వాడంటే ప్రత్యేకమైన అభిమానం. దానికి కారణం వాడిలో వుండే చురుకుదనం, సమయస్ఫూర్తే. టీచర్లలో వాడంటే వుండే ప్రత్యేకతను 'క్లాసులో ఫస్ట్ మార్కులు' తెచ్చుకోవడం ద్వారా నిరంతరం వాడు నిలబెట్టుకునేవాడు. ఆ రోజుల్లో పన్నెండేళ్ల వయసప్పుడే వాడు ఓ రకమైన సృజనాత్మకత కనపరిచేవాడు. వాడి పేరు ''రవికుమార్''ని వాడి ప్రతీ పుస్తక మీదా SUN SON అని రాసుకునేవాడు. అదేమిటని అడిగితే సూర్యుని మరో పేరు రవి. కొడుకుకి మరో రూపం కుమార్ వెరసి నా నామధేయం అనేవాడు. అంతేకాకుండా నోట్సు పుస్తకాల ప్రతీ పేజీలో ఓ మూల అడ్డంగా చిరంజీవి మొదటి సినిమా ''పునాదిరాళ్లు'' నుంచి అప్పటివరకూ నటించిన చిత్రాల పేర్లు, అలానే ఇండియాలో సిటీ పేర్లు రాసేవాడు.

నా విషయానికొస్తే వాడి తర్వాత స్థానానికి పోటీ పడే ఇద్దర్లో నేనొకడ్ని. కాబట్టి మా ఇద్దరికీ చదువు దగ్గర ఏ విధమైన శత్రుత్వం కానీ, పోటీ తత్వం కానీ వుండేది కాదు. అది మా ఇద్దరి స్నేహం బలపడడానికి కారణమైంది.

మామూలు రోజుల్లో మా చదువులతో కాలం గడిచిపోయేది. వేసవి సెలవుల్లో ఆటలు, పాటలు, తోటల్లో తిరగటాలు, ఏట్లో స్నానాలు, టూరింగ్ టాకీసు సినిమాలతో రోజులు నిండిపోయేవి. పదవ తరగతి వరకూ కలిసి సాగిన చదువు, తర్వాత నేను పాలిటెక్నిక్‌లోనూ, వాడు ఇంటర్మీడియేట్ జాయిన్ అవ్వడంతో విడిపోయింది. చదివేదారులు వేరయిపోయినప్పటికీ మేం మాత్రం సెలవుల్లో కలుసుకొని కబుర్లన్నీ చెప్పుకుంటుండేవాళ్లం.

పాత రోజుల వేసవి కాలం కబుర్లకీ, ఇప్పటి కాలేజీ కబుర్లకీ చాలా వ్యత్యాసం వుండేది. పాత కబుర్లలో ఆటలు, పాటలు, గిల్లికజ్జాలు, దొంగమామిడి కాయ

ల్లాంటివి వుంటే, ఈ కాలేజీ కబుర్లలో సినిమాలు, సిత్రాలు, అమ్మాయిలు వారి అందాల్లాంటి యవ్వనోత్సాహాలు తొంగిచూసేవి. వీటన్నింటితో పాటు అభిరుచులు, అలవాట్లు, కెరీర్, సంపాదన, లక్ష్యాలు కూడా ఇమిడి వుండేది. మా ఇద్దరికీ వుండే కామన్ అభిరుచి సాహిత్యం. నేను చిన్నచిన్న కవితలు గట్రా రాసేవాణ్ని. వాడికి సాహిత్యం చదవడం మాత్రమే అభిరుచి.

పోతే నా లక్ష్యం. కొన్నాళ్లు చదివి దానికి సరిపడా గవర్నమెంటు ఉద్యోగం సంపాదించుకొని హాయిగా కాలం వెళ్లబుచ్చడం ఇంతే. ఇంతకన్నా ఎక్కువ ఆలోచనలు వచ్చేవి కావు. వాడు మాత్రం ఎప్పుడూ పెద్ద పెద్ద కలల్ని కనేవాడు. పెద్ద బంగ్లా, కారు, పెద్ద మొత్తంలో డబ్బు, ఇలా వుండేవి వాడి ఆలోచన్లు. ''పెద్ద కుర్చీలో కూర్చొని, ఎదురుగా స్టూల్ మీద కాళ్లు పెట్టుకొని, ఒళ్లో పేపరు పెట్టుకొని కుడి చేతిలో కాఫీ కప్పు ఎడం చేతిలో టీవీ రిమోట్‌తో ఒక్కడే టీవీ చూడాలనేది'' వాడికి ఆ రోజుల్లో వున్న బలీయమైన కోరిక.

చదువు పేరుతో వేర్వేరుగా వుండడం వల్ల నైతేనేమి, వాళ్ల నాన్నగారి ఉద్యోగ బదిలీ రీత్యా అయితేనేమి ఆ తర్వాత మేమిద్దరం కలుసుకోవడం చాలా అరుదైపోయింది. అలా కొన్నాళ్లు గడిచేక, ఫోన్లో సంభాషించుకోవడం, ఆ తర్వాత ఎవరి జీవితాల్లో వారు స్థిరపడే ప్రయత్నాల్లో పడిపోవడంతో మా మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడింది. మధ్య మధ్యలో వాడు ఫోన్ చేసే సమయాల్లో నేను ఇంటి దగ్గర వుండకపోవడం, వున్నా ఏదో పొడిపొడిగా మాట్లాడుకోవడం జరిగేది.

నా చదువు పూర్తయి ఉద్యోగ వేటలో పడేటప్పటికీ వాడు హైదరాబాద్‌లో ఏదో ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తూండేవాడు. నెలకు అయిదారువేల వరకూ జీతమని చెప్పాడు. నేను మాత్రం డిప్లమో ఇంజనీరింగ్ పూర్తి చేసి సంవత్సరం నుంచి ఖాళీగా వుంటూ ఏవో టెస్టులు రాస్తున్నాను. ''ఆ పల్లెటూలో వుండి ఏం చదువుతావు గాని, హైదరాబాద్ వచ్చి నాతో పాటు వుంటూ ఇక్కడే ప్రిపేరు అవుదువు లేదంటే ఏదైనా కంపెనీలో జాయిన్ అవుదువుగాని వచ్చేయ్'' అంటూ వుత్తరంరాశాడు. ఇప్పటి వరకూ నా చదువు వల్ల ఏర్పడ్డ ఇబ్బందులు చాలక మళ్లీ ఇప్పుడు ఈ ప్రిపరేషన్లు, టెస్టులు పేరు చెప్పి మరలా ఇంట్లో భారం కాకూడదనే వుద్దేశంతో వాడి దగ్గరకు వెళ్లాలని వున్నా వెళ్లకుండా వూర్లోనే వుండిపోయాను. ప్రైవేటు జాబ్‌లో జాయిన్ అయితే గవర్నమెంట్ వుద్యోగం చేయాలనే నా లక్ష్యం చేజారిపోతుందేమోనన్న భయంతో హైదరాబాద్ వెళ్లే ఆలోచన పూర్తిగా పక్కన పెట్టి నా ప్రయత్నాలు ఊర్లో వుంటూనే సాగిస్తున్నాను.

రోజులు గడుస్తున్నాయి....

నా ఉద్యోగ ప్రయత్నాలేవీ సఫలం కాలేదు. వాడి దగ్గర్నుంచో రోజు ఫోనొచ్చింది. 'నెలకు ఏడు వేల లెక్కన సంత్సరానికి ఎనభైనాలుగు వేలు, అరియర్లు, ఇంక్రిమెంట్లు కలిపి ఏడాదికి లక్ష రూపాయలు సంపాదిస్తే, ముప్పై, ముప్పై అయిదేళ్లలో మహా కష్టపడ్డా ఓ ఇల్లు కూడా సంపాదించుకునే స్థాయి కూడా రాదు కాబట్టి చేస్తున్న ఉద్యోగం వదిలేసి వేరే ఏదైనా చేయాలనుకుంటున్నట్లు' ఫోన్ సారాంశం.

కనీసం నా ఖర్చులు నిమిత్తం కూడా సంపాదించుకునే దిక్కులేని స్థితిలో నేనుంటే, ఏడువేలు నెలకు సంపాదించే వుద్యోగం కూడా వదిలేస్తూ, అది కూడా తర్వాత ఏం చేయాలో నిర్ణయించుకోకుండా వున్న దాన్ని వదిలి పెట్టడం ఏంటో నాకైతే అర్థం కాలేదు.

అదే మాట వాడితో అంటే ''ఇది చేస్తూ ఆలోచిస్తుంటే అంతకన్నా ఎక్కువ స్థాయి ఆలోచన కానీ, అవకాశం కాని రావడం లేదు. ఇప్పుడు బాగానే వున్నాను కదా, అనే సర్దుబాటు తనం నాలో డెవలప్ అవుతుంది. అంచేత ముందు వుద్యోగం వదిలేసి ప్రయత్నాల్ని ముమ్మరం చేయాలి. రిస్కు ఇప్పుడు తీసుకోకపోతే మరెప్పుడు తీసుకోలేం' ఇది వాడి వాదన.

ఆ తర్వాత వాడి స్వంత సంపాదనతో కూడబెట్టిన దాన్ని పెట్టుబడిగా పెట్టి ఏదో మల్టీమీడియాకోర్సులో జాయిన్ అయినట్లు, ఆ తర్వాత అదే ఇనిస్టిట్యూట్‌లో ఫాకల్టీగా జాయిన్ అయి, పాత కంపెనీలో రిజైన్ చేసినప్పటికీ ఆ శాలరీకి సమానమైన శాలరీ అందుకుంటున్నట్లు తెలియపర్చాడు కొన్నాళ్లకు.

ఈలోగా నేను గవర్నమెంటు ఉద్యోగంలో జాయిన్ అవడం, నెలకు ఇంత అంటూ ఇచ్చే జీతం తీసుకుంటూ ఏ విధమైన కష్టనష్టాల బారిన పడకుండా సాఫీగా కాలం సాగిస్తున్నాను. పని చేసినందుకు గుర్తింపుకానీ, చెయ్యనందుకు శిక్షగాని లేని నేను, కాలచక్రంతో పాటు పెళ్లి పిల్లలు అన్నీ పూర్తయ్యాయి.


వాడు మాత్రం ఒక కంపెనీ నుంచి మరోకంపెనీకి, మరొకదాన్నుంచి ఇంకో దానికి ఇంకో దాన్నుంచి ఇంకా ఎక్కువ జీతాన్నిచ్చే మరో ఎంఎన్‌సికి మారుతూ, వారంలో సరాసరి మూడురోజులు పెద్ద పెద్ద నగరాల్లోస్టార్ హోటల్లోనో, సింగపూర్, శ్రీలంక, మలేషియా లాంటి విదేశాల్లో తిరుగుతూ వున్నాడు. నా పెళ్లి సమయంలో కూడా విదేశీ టూర్లో వుండడం వల్ల రాలేకపోయాడు. నా భార్య ప్రసవ సమయం కావడంతో వాడి పెళ్లికి నేనూ వెళ్లలేకపోయాను. కాని మా ఇద్దరి మధ్య కమ్యూనికేషన్ మాత్రం నడుస్తూనే వుంది వాడు కంపెనీ మారిన ప్రతిసారీ, విదేశాలు వెళ్లే ప్రతిసారీ నాకు తెలియపరుస్తూనే వున్నాడు. అట్లా చెప్పిన ప్రతీసారి వాడి అభివృద్ధి పట్ల కాస్తంత అసూయ, వాడు కష్టపడుతూ రిస్కు తీసుకుంటూ ఒక్కో మెట్టు ఎక్కుతూ లక్ష్యాన్ని సాధించే తత్వానికి ఆనందపడేవాణ్ని.

మరలా ఇన్నాళ్లకు బెంగుళూరులో ఓ స్వంత ఇల్లు కొనుక్కొన్నానని గృహప్రవేశానికి రావల్సిందిగా కోరుతూ ఫోన్ చేస్తే, పాత మిత్రుడ్ని, వాడి అభివృద్ధిని కన్నులారా చూడడానికి బయల్దేరాను. వాడు ఫ్లైట్లో రమ్మన్నా నా స్థాయికి మించి ప్రవర్తించడం ఇష్టం లేక ట్రైన్‌లోనే బయల్దేరాను. స్టేషనుకు మాత్రం వచ్చి రిసీవ్ చేసుకోవలసిందిగా కోరాను.

కారు మార్తహళ్లి రింగురోడ్డులో చప్పుడు చేయకుండా దూసుకుపోతుంది. ఖరీదైన కారులో ఆ మహానగరంలో వాడితో పాటు ప్రయాణిస్తుంటే ఏదో అనుభూతి మనసు ఆస్వాదిస్తోంది. సన్నని మ్యూజిక్, చల్లని ఏసి గాలి, సువాసనలు వెదజల్లే పెర్‌ఫ్యూమ్, మెత్తని సీటు నన్ను మాట్లాడనివ్వకుండా, మాటలు రానివాడిగా చేసాయి. వాడు మాత్రం నా ఫ్యామిలీ, అమ్మ, నాన్న, విషయాలు అన్నీ అడుగుతూ తెలుసుకుంటున్నాడు. వాడి మాటల్లో అదే చురుకుదనం. అదేదూసుకుపోయే తత్వం ఇప్పటికీ. కారు పెద్ద బంగ్లా ముందు ఆగడంలో వాడి వాక్ప్రవాహానికి, నా ఆలోచనలకు ఆనకట్ట పడింది.

★★★

గృహప్రవేశ మహోత్సవం ముగిసింది. చుట్టాలు, బంధువులు తెలిసిన వాళ్లు, పరిచయస్థులు అందరూ వెళ్లిపోయారు. వెలకట్టలేని విందు భోజనాలకు విలువైన కానుకలు జతగా ఇచ్చి అందరినీ సంతృప్తి పరిచారు. నాక్కూడా సెలవిప్పించవలసిందిగా కోరాను. ఎట్టి పరిస్థితుల్లోనూ నేను వెళ్ళేందుకు వీల్లేదన్నాడు. నాకూ పాత మిత్రునితో మనసారా మాట్లాడాలని, కొన్ని జ్ఞాపకాల్ని మరి కొన్ని అనుభవాల్ని పంచుకోవాలని వుండడంతో వాడి అభ్యర్థనను కాదనలేకపోయాను.





## ← వెయిట్ మేనేజ్‌మెంట్

ఆమె ఎప్పుడు ఏది అనుకుంటే అప్పుడు అది చేసి తీరుతుంది. ఇప్పుడు ఆమెకు బరువు తగ్గాలనిపించింది. అందుకే తగ్గడానికి కృషి చేస్తోంది. తగ్గానని చెబుతోంది కూడా. ఓ సినిమా షూటింగ్ సందర్భంగా ప్రియాంకను బరువు తగ్గమన్నాట్ట దర్శకుడు. అంతే! ఇప్పుడు వెయిట్ మేనేజ్‌మెంట్ చేస్తోంది. సమయానికి తిండి తీసుకుని రెగ్యులర్‌గా వ్యాయామం చేస్తున్నానంటోంది. ఇప్పటికే నాలుగు కిలోల బరువు తగ్గాను.. ఆకుకూరలు, కాయగూరలు తింటూ, కాసిన్ని నీళ్లెక్కువ తాగుతున్నానని చెబుతోంది. కడుపు మాడ్చుకుని బరువు తగ్గడమెందుకూ అని అంటే, అందమంటే ఊరికే సొంతమవుతుందా అని చెప్పుకొచ్చింది.

★★★

రాత్రి భోజనం చేసిన తర్వాత ఇద్దరం బంగ్లా మేడమీదికి చేరుకున్నాం. పిట్టగోడ పక్కన వున్న చైర్‌లో కూర్చున్నాను నేను. ఎదురుగా పూల కుండీల మధ్య వున్న రూఫ్ గార్డెన్ క్రాడిల్ చైర్‌లో కూర్చున్నాడు. అంతలోనే లేచి అనవసరంగా ఈ లైటు ఎందుకు? చంద్రుడు, చుక్కల వెలుగు వుండగా అఫ్‌కోర్స్ మిగతా చుట్టుపక్కల లైట్లు మనని వెన్నెల్ని పూర్తిగా ఆస్వాదించనివ్వవనుకో! అంటూ లైటు తీసేసి వచ్చికుర్చీ పక్కనే వున్న పిట్టగోడ మీద కూర్చున్నాడు.

చెప్పరా.... ఏంటి? మనవూరు సంగతులు? నీ సంగతులు? అనడిగాడు.

చెప్పడానికి ఏమున్నాయ్... అందరూ అంతో ఇంతో సంపాదించుకుంటున్నారు. వున్నంతలో ఎవరి స్థాయిలో వారు సుఖసంతోషాలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇక నా సంగతంటే ఏముంది? జీతానికి సరిపడా ఖర్చులు, ఎక్కువ తక్కువ కాకుండా వచ్చే పొలమ్మీది ఆదాయం. అన్నింటా అనుకూలమైన భార్య, మా సంతోషానికి సంకేతంగా అమ్మాయి, అబ్బాయి, అండగా అమ్మా, నాన్న, వున్న వూరు, బాదరబందీ, కష్టనష్టాలు లేని ప్రశాంతమైన జీవితం. నీ అంత పెద్దగా ఏమీ సంపాదించలేదు కానీ సొంత ఇల్లు, భవిష్యత్ అవసరాలకు సరిపడా కాస్త మొత్తం ఇంతే. ఇక ముందు ముందు పిల్లల చదువులతో ఖర్చు తప్పితే దాచగల పరిస్థితి కూడా వుండదు. కాకపోతే అందరం ఒకే దగ్గర ఒకరికొకరం తోడుగా వున్న వూర్లోనే వుండడం అదో సంతృప్తి... అంతేరా.... నీసంగతేంటి...? చివరిగా అడిగాను.

ఆకాశంలోకి చూస్తూ...''అంతా బాగానే గడిచిపోతుంది. నెలకు సగం రోజులు వేరే దేశాల్లోనో, ఏ మెగాసిటీ నక్షత్రాల హోటల్లోనో, కాన్ఫరెన్సుల తోనూ, సెమినార్లతోనూ గడిచిపోతుంది'' తన స్థాయిని తలచుకుంటూ గొప్ప చెప్పుకుంటూ హోదా, లగ్జరీలు, విమానప్రయాణాలు, స్పెషల్ అలవెన్సులు అంటూ ముగించాడు. కానీ ఇంకా ఏదో చెప్పాలని మాట్లాడాలని వున్నా ఎందుకో ఆగిపోయాడు.

''రవీ! మేము ఎప్పుడైనా గుర్తుకు వస్తామంట్రా? మనూర్లో అయితే గొప్ప వాళ్ల గురించి మాట్లాడే ప్రతిసారీ నిన్నే గుర్తుకు తెచ్చుకుంటాంరా! ''

రవి ముఖంలో ఓలాంటి భావన కాసేపు కదలాడి తర్వా మాయమయింది. ఆ తర్వాత చెప్పడం ప్రారంభించాడు.

మొదట్లో నేను, నాకెరీర్, సంపాదన, వీటిని సాధించే ప్రయత్నంలో అప్పుడప్పుడు మన వూరు జ్ఞాపకాలు వచ్చినా బలవంతంగా వాటినన్నింటిని దూరంగా నెట్టేశాను. జీవితంలో సాధించాల్సిన లక్ష్యాల కోసం క్షణం కూడా తీరిక లేకుండా వూపిరి సలపకుండా కష్టపడ్డాను. జీవితంలో ఒక్కో మెట్టు ఎక్కడానికి అవసరమైన ప్రతి అవకాశాన్ని వెదికి పట్టుకున్నాను. దొరికిన ఏ అవకాశాన్ని జారవిడుచుకోకుండా నిత్యం లక్ష్యసాధనలోనే గడిపాను. అలా ఒక్కో మెట్టు ఎక్కే కొద్దీ నన్ను నేను నిర్మించుకోవడంలో కొందరికి నేను దూరమైపోయాను. నా స్థాయి పెరిగే కొద్దీ తమ స్థాయికి సరికాదని కొందరు నన్ను విస్మరించారు.

డబ్బు సంపాదించే కొద్దీ నాస్థాయి పెరుగుతుందని అది అందరికన్నా నన్ను పైన నిలబెడుతుందని భావించాను. డబ్బుతోనే మనిషికి విలువని అనుకున్నాను.

మీ అందరికన్నా పైపైకి వెడుతున్నాను అనుకున్నానే కానీ మీ అందరికీ దూరంగా వెళ్లిపోతున్నానన్న విషయం అప్పుడు గ్రహించలేదు. తీరా ఇప్పుడు పైన వున్నా, నా చుట్టూ వున్న వారిలో ఒక్కరూ నావారంటూ లేక ఒంటరివాడ్నయిపోయాను.

జీవితంలో ఓ స్థాయిని ఆశించి దాన్ని సాధించడం కోసం అహర్నిశలు కష్టపడ్డాను. అది సాధించిన తర్వాత దాన్ని నిలబెట్టుకోవడం కోసం యాతన. ఎక్కువ కాలం ఒకే స్థాయిలో వుండడం వల్ల కలిగే మొనాటనీ బ్రేక్ చెయ్యడం కోసం ఇంకా పై స్థాయికోసం పాట్లు. అందుకే పై నుంచి నేను దిగిరాలేను. అలా అని మిమ్మల్ని నా స్థాయిలో నిలపనూ లేను. బ్రతుకంతా అలుపెరగని పోరాటం. యుద్ధం ప్రారంభించడం వరకూ.... ముగింపు మన చేతిలో వుండదు. ఆ యుద్ధం సంపాదన కోసమైతే ముగింపే వుండదు.

డబ్బు....బంగ్లా...కారు ఖరీదైన వసతులు అన్నీ వున్నా ఆనందం లేదు. సుఖాలన్నీ వున్నా సంతోషం మాత్రం సున్నా. ఇన్ని సుఖాలు వున్నా ''కుర్చీలో కూర్చొని ఎదురుగా వున్న స్టూలు మీద కాళ్లు పెట్టుకొని, ఒళ్లో పేపరు వుంచుకొని, కుడిచేతిలో కాఫీ కప్పు, ఎడం చేత్తో రిమోట్ పట్టుకొని టీవీ చూడాలనే '' చిన్న కోరిక నాకిప్పటికీ తీరలేదు. తీర్చుకోలేక కాదు.

కొన్ని అంతే...మనం గొప్పవి అనుకున్నన్నాళ్లు మనకి అందుబాటులోకి రావు. తీరా అవి అందుబాటులోకి వచ్చే సరికి అది గొప్పదన్న భావం వుండదు '' జీవితం ఇంతే...